# కథ కాని కథ

మనీ, మనీ, మనీ.

* * * *

వెనక భర్తృహరి ఏమన్నాడంటే చాలా అన్నారులెండి. అవన్నీ జ్ఞాపకం ఉంటే ఈ వ్యాసమే వ్రాయకపోదును. కాని క్రితం సంవత్సరాదినాడు మా యింటిపక్క డాక్టరుగారి కూతురు కుముదం ధరించిన చీర తాలూకు రంగు పూర్తిగా జ్ఞాపకం ఉంది. ఇంద్రియాల ద్వారా సంపాదించిన అనుభవాలు జ్ఞాపకాని కొచ్చినట్లు, పుస్తకాల ద్వారా గ్రహించిన జ్ఞానం రాదు కాబోలు. మన పూర్వులు మాత్రం శరీరం 'మాయ' అని, దాని ద్వారా పొందిన వికాసం 'భ్రమ' అని, సత్యాన్ని, సజీవమైన జ్ఞానాన్ని తెలుసుకునే శక్తి, 'బుద్ధి'కి వుందనీ, నమ్ముతూ వచ్చారు. అనాది నుంచీ వొస్తున్న ఈ నమ్మకం నా ఎముకలకి సైతం పట్టినట్లుంది. చిన్నతనంలో నాకో శరీరం వుందని చాలాకాలం గ్రహించనే లేదు. సైకిల్ మీదనుంచి పడ్డప్పుడు కూడా, ఆ తగిలిన దెబ్బ సైకిల్‌కే ననుకుని, దాన్ని చూసి జాలిపడి, వారంరోజులవరకూ దాన్ని పైకి తియ్యనేలేదు. ఏ మాటకామాటే చెప్పాలి. నాకు 'బుద్ధి' 'మనస్సు' ఉన్నాయని కూడా చాలాకాలం వరకూ తెలిసింది కాదు. ఇప్పుడూ, ఇవి కొంతవరకూ సంశయాస్పదాలుగానే కనిపిస్తాయి. 'మనస్సు'ని గురించి సర్. రాధాకృష్ణన్‌గా రేమన్నారంటే – ఏమంటే ఏం ప్రయోజనం? నాకు ఒక్కటే ఇప్పుడు ఉపయోగంలోకి రావడంలేదు.

ఇంతకీ నే చెప్పొచ్చేదేమిటంటే నా జీవిత విధానం అంతా 'బుర్ర' చేత పుస్తకాల ద్వారా పొందిన 'విజ్ఞానం' మీద ఆధారపడిందని భౌతిక ప్రపంచం కంటే గ్రంథాలలోనూ, ఊహలలోనూ, ఉన్న ప్రపంచం యథార్థమైందనీ, సౌందర్యమైందనీ నా నమ్మకం. జీవించిన వ్యక్తులంటే నాకు గౌరవం లేకుండాపోయింది. అమ్మ, నాన్న, అన్నా, చెల్లెలూ, వీళ్లందరూ 'ఊహ' లేని మట్టిబొమ్మలు. వాళ్ళ భాష 'ధ్వనులు'. నా ఊహాలోని వ్యక్తులతో వీళ్ళని పోల్చిచూస్తే 'నీడల' మాదిరి కనిపిస్తారు. వాళ్ళ మతం పిచ్చిఏడ్పు; రాజకీయం రాళ్ళతో కొట్లాట; వివాహం బొమ్మలపెళ్ళి; ఇవన్నీ గట్టిగా నమ్ముతాను. మానవలోకానికి అతీతం అవడమే కాకుండా ప్రపంచాన్ని వొదలి నిశీథంలోకి వెళ్ళి, ఒక్క తాపుతంతే, ఈ గోళం ముక్కలుముక్కలై శూన్యత్వంలో ఐక్యం అవుతుంది. నవ్వుతూ, వెక్కిరిస్తూ నేను మాత్రం మిగుల్తా.

డబ్బు, డబ్బు, డబ్బు.

ఊహలో ఇవన్నీ చేయగల్ను. కాని ఈ మనుషులతో నాకున్న అవసరం తీరదు. అమ్మ అన్నం పెట్టాలి. నాన్న డబ్బివ్వాలి. అన్నయ్యతో ఆడుకోవాలి. చెల్లెలితో ఫిడేలు

నేర్చుకోవాలి. దాని మొగుడికి కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు ఇవ్వకపోతే మా నాన్న తంతాడు. రెండూ, రెండూ ఎంతో చెప్పకపోతే మేష్టరు బుగ్గని సున్నాలా తిప్పి, పేపర్లో అంత సైజుసున్నా, ఎఱ్ఱి పెన్సలుతో చుడతాడు.

అందుకనే ఈ ప్రపంచం అంటే అంత భయం నాకు, ఇది నిజంకాదు 'మాయ' అని తెలుసు. ఐతే ఏం లాభం? నేనిందులోనే వుండి, వీళ్ళతో తగాదాలుపడి నా బ్రతుకు నే బ్రతకాలి. మనుషులు రెండు రకాలనుకుంటా; నాయకులు, అనుచరులు. నేనీ రెండో రకానికి చెందుతా. నాయకుల పని ఎవళ్ళు ఎల్లా ఉండాలో, ఏం చెయ్యాలో, ఏం ఆలోచించాలో మొదలైన విషయాలు చెప్పడం, కిక్కురుమనకుండా అన్నీ అమల్లో పెట్టడం అనుచరుల పని. కుటుంబంలో పెండ్లికానంతవరకూ నాయకుడు నాన్న; వివాహం జరిగిం తర్వాత నాయకురాలు భార్య అనుకుంటా; ఉద్యోగంలో పై అధికారి; జబ్బుచేసినప్పుడు వైద్యుడు; చచ్చింతర్వాత నాయకుడు శాస్త్రుర్లుగారు.

నే అనుసరించే నాయకులు జీవించి ఉన్న మనుషులు కారు. వాళ్ళంతా గొప్ప గ్రంథాలు వ్రాసి చచ్చిపోయినవాళ్లే. నా భావాలు, వాంఛలు, ఆలోచనలు అన్నీ వాళ్ల బోధనలని అనుసరించినవే. అంటే రెండు ఉదాహరణలు మాత్రం ఇస్తా. "మ్రొక్కిన వరమీని వేల్పుని గ్రక్కున విడువంగ వలయు"నన్నారు. రోజూ ఉదయం ఎనిమిదిగంటలకి నాకు సంస్కృతం చెప్పే ఆచార్లుగారొచ్చేవారు. ఆయన్ని రాకుండా చేయమని రోజూ కృష్ణుడి విగ్రహానికి మొక్కేవాణ్ణి. ఒకరోజున ఆయనొచ్చే సమయానికి గదిలో దూరి గడియ పెట్టుకున్నా. మేష్టారికి తేలు కుట్టిందని అరుపు వినిపించి బైటకొచ్చాను. ఏమీ కుట్టలేదు. ఆ చుట్టుపక్కల కందచీమేనాలేదు. నన్ను బైటికి రప్పించేటందుకు వేసిన ఎత్తు. వెంటనే కృష్ణుడి బొమ్మని నూతిలోకి గిరవాటెట్టాను. రెండోది కొంచం జ్ఞానం వొచ్చింతర్వాత జరిగింది.

"ముద్దులన్నింటిలోకి దొంగిలించిన ముద్దు మధురమైంది" అని ఎక్కడో చదివాను. ఎన్నిరకాల ముద్దులున్నాయో నాకింతవరకూ తెలీదు. ఒక్కటేనా దొంగిలించి తీరాలని నిశ్చయించుకున్నాను. మా ఇంటిపక్కని నారాయణరావుగారి కూతురు, మిట్టమధ్యాహ్నం గదిలో నిద్రపోతుంటే మెల్లగా వెళ్ళి వెనకనించి చెవులని తాకిచూశాను. కనురెప్పలు కదిపి 'ఫెడీ' మన లెంపకాయ కొట్టింది. టెన్నిసన్‌కవి "ప్రేమించకుండా ఉండడం కంటే, ప్రేమించి ఓడిపోయి పోగొట్టుకోవడం మంచిది" అని వ్రాశాడు. ప్రేమించి, ఓడిపోయి లెంపకాయ తినడం మరీ మంచిదనుకుని, సమాధానపడుతూ ఉంటాను, అది జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా.

రూపాయలు, రూపాయలు, రూపాయలు.

ఆధునిక ప్రపంచంలో ఎట్లా బ్రతకాలో ఆలోచించే అవసరం లేకుండా ఉంది. ఇలా కాకపోతే నాలాంటివాళ్ళు ఎన్నాడో ఆత్మహత్య చేసుకుని వుందురు అందుకనే ఆధునిక మానసిక శాస్త్రజ్ఞులు (ముఖ్యంగా నిహే వియరిస్టులు) 'బుఱ్ఱ', 'మనస్సు' లేవు, పోన్ పొమ్మన్నారు. తిండి, బట్టా, అమ్మానాన్నా చూస్తారు. నా పరీక్షలు 'గురువులు' ప్యాసవుతారు. నా మతం దైవచింతా అన్నీ నా పూర్వులే నిర్ణయించారు. అప్పుడప్పుడు బద్ధకించి మరిచి

పోతానేమోనని వాళ్ళు దేవాలయాలు కూడా కట్టించారు నా రాజకీయాలని గురించి ఆలోచించే అవసరం అసలేలేదు. నా అభిప్రాయాలని, పత్రికా సంపాదకులు, నా ప్రమేయం లేకుండానే ప్రపంచానికి చాటుతారు. పత్రికా రచనంటే ఏమిటి? కుప్పుస్వామి బ్రతికి ఉన్న సంగతే తెలియని భారతదేశానికి, ఫలానా కుప్పుస్వామి గతించాడని చెప్పడం - అంటే ఆ ఫలానా కుప్పుస్వామి కారుకింద పడినప్పుడు కారుకిందపడే భాగ్యం అందరికీ కలుగుతుందనుకోవడం చాలా పొరపాటు. నాగరికత కోసం తమ జీవితాలని త్యాగం చెయ్యడానికి సిద్ధపడేవాళ్లే అలా చెయ్యగలరు. నేనెప్పుడు పుట్టిందీ, చచ్చిందీ, ఆఖరికి మా వూళ్ళో 'జననమరణాల' రిజిస్ట్రార్‌కి కూడా తెలీదు. పత్రికలను గురించి 'కజిన్స్' దొరగారేమన్నారంటే...

నోట్లు, నోట్లు, నోట్లు.

నా ఆస్తి వ్యవహారాలన్నీ మా లాయర్‌గారే చూస్తారు. చచ్చిపొయ్యేముందు, నా జబ్బు పేరేనా నాకు చెప్పకుండా, నన్ను పరలోకానికి రవాణాచేసే డాక్టర్లు చాలా కొద్దిమంది ఉన్నారు. మరి నా పెళ్ళి విషయం? ఇంతవరకూ ఆ ఆలోచన నాకు రాలేదు. అంతమాత్రం చేత 'స్త్రీ'ని గురించి నేనెప్పుడూ ఆలోచించననీ మహాయోగినని చెప్పుకోడం కాదు. అసలెప్పుడూ అదే ఆలోచన. కాని 'పెండ్లి' అనే బెడద లేకుండా 'స్త్రీ' దొరికే మార్గం ఉంటే ఎవళ్ళేనా చెబితే బాగుండును.

ఇటీవల శాస్త్రజ్ఞులు, మానవుడి శరీరం ఖరీదు ఒక రూపాయి, రెండణాలని నిర్ణయించారు. అంటే ఆ డబ్బుతో శరీరం ఏ సామాన్లతో చెయ్యబడిందో అవన్నీ బజార్లో కొనొచ్చు. సెంట్రల్ స్టేషన్‌లో ఒక యంత్రంలో అణాకాసు పెడితే, ప్లాటుఫారం టికెట్ చక్కా వొచ్చినట్లు, రూపాయిబేడా పెడితే ఒక అందమైన స్త్రీ బైటపడే యంత్రం ఏ శాస్త్రజ్ఞుడేనా కనిపెడితే బాగుండును. కొద్ది కాలంలో ఈ యంత్రం వచ్చే సూచనలున్నాయి. రాకపోయినా, నా పెద్దలు నాకు వివాహంచేసి తీరతారు. నాకా బెంగ ఎప్పుడూలేదు. వివాహం జరిగి, పిల్లలతో కాపరం చేస్తున్న కుటుంబీకుడికే, తమ పిల్లలనిచ్చి వివాహం చేస్తామని అడుగుతున్న మహాదాతలు ఈ ఆంధ్రదేశంలో ఎందరో ఉండగా, మీరూ నేనూ ఈ విషయాన్ని గురించి ఇంతగా యిదవడం, చాలాయిది అంటాను. వివాహాన్ని గురించి, వెష్టర్ మార్క్ ఏమన్నా....

పైకం, పైకం, పైకం.

నా నీతి విషయం రెండు ముక్కలు చెప్పి, ఈ ప్రసంగం ముగిస్తా. ఇదొక మహారణ్యం. ఎవళ్ళకీ ఏమీ తెలీనట్లు కనిపిస్తోంది. అందరికీ తలో 'నీతి' వుండడం మూలాన ఏ ఇద్దరూ అంగీకరించడంలేదు. మొగాడికి, 'నీతి' అవసరంలేదని మా నాన్నా; అట్లాగైతే ఆడదానికీ అక్కర్లేదని మా అమ్మా ఎట్లా చావను చెప్పండి?

మా అక్కయ్య అంటుంది - (అదీ కాలేజీలో చదువుకుంటోంది లెండి) పెళ్ళికాకపోతే, ఆడదానికి కాని, మొగాడికి కాని, నీతి అక్కర్లేదు తమ్ముడూ అంటుంది. అంతవరకూ వుంటే వుండలేమోకాని వివాహం జరిగింతర్వాత 'నీతి' అక్కర్లేదనీ, లారెన్సు, జామిస్ మొదలైన నవలాకారులంటున్నారు. వెధవలకోసం 'నీతి' నెలకొల్పబడిందని

గిరీశంగారు అసలు జంతువులకి లేని నీతి మానవుడికి మాత్రం ఎందుకూ అక్కర్లేదని ఒమర్ ఖయ్యామ్ వెనకే అన్నాడు. ఎప్పుడు కావాలో, అక్కర్లేదో మాట అట్లా ఉంచి అసలు నీతంటే ఏమిటి? ఈ దిగువ కొందరి అభిప్రాయాలను పొందుపరుస్తా. "అందరూ ఎట్లా చేస్తే అట్లా చెయ్యడం (బ్రాడ్లే) "అల్లా చెయ్యకపోవడం" (జినోన్సు) "తప్పుడు పన్లుచేసి పట్టుపడకపోవడం" (పాస్కల్) "నీతిపరుడుగా నటించడం" (బారోషిప్ కాల్డ్) చెమిటి భర్తా, గ్రుడ్డి భార్యా కలిస్తే నీతి" (లాబ్రాయరీ) "శరీరం వాంఛలని, 'వాక్కు' ద్వారా తీర్చుకోవడం" (ఫ్రాయిడ్) "శరీరం వాంఛలని, శరీరం ద్వారా తీర్చుకోవడం" (ఆల్డస్ హాక్స్‌లీ) ఇట్లాటి పరిస్థితులలో ఏం చెయ్యాలో నిర్ణయించే శక్తి నాకు లేదు ఆలోచించే వోపికా, తీరుబడి బొత్తిగా లేవు. కాని ఈ 'నీతి' లేందే ప్రపంచంలో నెగ్గలేం, అని మొదట్లోనే చెప్పా. పైగా అది మీ అందరికీ తెలిసిన విషయమే. ఈ క్రింద చూపించిన ప్రశ్నలకి సమాధానం తెలిస్తే 'నీతి' అంటే ఏమిటో తెలిసినట్లు భావించొచ్చు..

1) మనుష్యులతో 'స్నేహం' సంపాదించడం ఎట్లా? (జంతువులతో స్నేహం చేసుకోడం మానవుడికి తెలుసు అని దాని తాత్పర్యం. శత్రువులు కూడా మన ప్రాణస్నేహితులుగా మారాలి.)

2) పై అధికారి మన్నన, ఆదరణ పొందడం ఎట్లా?

3) నువ్వు ప్రేమించిన 'స్త్రీ'నీ పాదాలమీద కాకపోయినా, అధమం భుజాల మీదేనా వాలే మార్గం నీకు తెలుసా?

4) నీ రహస్యాలు, భార్యకి తెలిసినప్పుడు చెంబుతోగాని, గరిటెతోగాని, చీరమడతతోగాని, (విద్యావతి ఐన ఎడల సిరాబుడ్డితోగాని) నీ మీదకి యుద్ధానికి రాకుండా చేసుకోడం ఎట్లా?

5) నువ్వు దైవానివని తెలుసుకున్నావా? తెలుసుకున్న తరువాత, నీ భక్తులని ఎట్లా ప్రేమించగలవో క్లుప్తంగా చెప్పు?

ఇట్లాంటివి మరో ఐదు ప్రశ్నలూ, వాటి సమాధానాలు ఒక గ్రంథరూపంగా వ్రాసి నాబోటి దౌర్భాగ్యులకూ, ప్రపంచంలో ఎట్లా బ్రతకాలో తెలీని గుంటలకూ శాశ్వతమైన ఉపకారంచేసి, మా కృతజ్ఞతను గణించుకున్నారు – ఇటీవల 'డేల్ కార్నీజీ' అనే అమెరికన్ దొరగారు. ఆ గ్రంథరాజం పేరు "స్నేహితులని ఎట్లా చేసుకోడం – వ్యక్తులపై వొత్తిడి కలిగించడం దాని విధానం." ఇది అన్ని రైల్వే బుక్‌స్టాల్స్‌లోనూ దొరుకుతుంది. అట్టమీద 'కార్నీజీ' గారి 'ఫోటో' కూడా ఉంటుంది. ఇది కొన్ని కోట్ల కాపీలు అమ్ముడుపోయింది. ఈ 'విధానం' అనుసరించి జీవితంలో పారమార్థం పొందిన ఒక లక్ష వ్యక్తులు, దీన్ని ప్రశంసిస్తూ వ్రాసిన వాక్యాలు కూడా పుస్తకం చివర ఉంటాయి. దీని వెల రెండు రూపాయలనుకుంటా. మీ పబ్లిషర్ని కలుసుకుని, దీని నేటి వెల తెలుసుకోండి.

దస్కం, దస్కం, దస్కం.

పై ప్రశ్నలకి ఆయనిచ్చిన సమాధానం వ్రాస్తే నేనో గ్రంథకర్తను కాగలను. అంచేత, 1, 3 ప్రశ్నలకు ఆయన చెప్పిన సమాధానం మాత్రం వ్రాసి అవి నేనెల్లా అనుభవంలోకి తెచ్చుకున్నదీ చెప్పి ముగిస్తా.

1) 'స్నేహం' చేసుకోవడం ఎట్లా?

నాకు స్నేహితులూ లేరు. విరోధులూ లేరు. నాలో ఏముందో తెలీదు కాని, నేనంటే ఎవళ్ళకీ సరిపడదు. కొంతకాలం క్రిందట వాల్తేరు స్టేషన్లో, చిత్రంగా అగుపించిన మనిషిని చూచి, కుతూహలపడి 'తమ దేవూర'ని అడిగాను.

"నేను అబిసీనియా చక్రవర్తిని" అన్నాడు. రెండడుగులు వెనక్కే తగ్గాను. అంత భాగ్యమే నాకు! "వెనక పోలండ్ ప్రధానమంత్రిగా ఉండేవాణ్ణి" అన్నాడాయన. ఈయనకి తెలుగు భాషలో ఇంత ప్రవేశం యెట్లా కలిగిందా అని ఆశ్చర్యపడ్డాను. "ఆగాఖాన్‌కి రికమండేషన్ ఇస్తాతీసుకెళ్ళండ"న్నాడు. అంతే ఆ మనిషిని తీసుకుపొయ్యారు, ఇద్దరు ఎర్రటోపీ వ్యక్తులు నేను కాదు పిచ్చివాణ్ణి అతను.

మొదటి ప్రశ్నకి కార్నీజీగారిచ్చిన సమాధానం ఈ దిగువ పొందు పరుస్తున్నా.

అ : అవతల వ్యక్తిని గురించి మాట్లాడు.

ఆ : నిన్ను గురించి మాట్లాడొద్దు.

ఇ : సాధ్యమైనంతవరకూ, అతన్నీ అతని కుటుంబాన్నీ మెచ్చుకో. అతని సంసారం సంగతులన్నీ తెలుసుకో. అతని అభిరుచులు, అభిప్రాయాలు తెలుసుకొని తదనుగుణ్యంగా మాట్లాడు.

ఈ : స్థుతించు, ఆపేక్షంతా దొల్లిపోతున్నట్లు అతని పేరు, వయస్సు, ఉద్యోగం, చిరునామా, నోటుబుక్కులో అతనిముందే ఎక్కించు అతన్నే వ్రాసియిమ్మను.

షరా ॥ ఇవన్నీ ఎప్పుడు అనుచరణలో పెడతావు? నేడే ఇప్పుడే, లే. వెళ్ళు.

చట్టుక్కన పుస్తకం మూసేసి, బండి కట్టించుకుని స్టేషన్‌కి ఎగబడ్డాను.

బండివాణ్ణి చూసి పేరు చెప్పమని దీనంగా కోరాను.

"ఏం, రాసుకుంటావా? రాసుకుంటే రాసుకో నాకేం భయం?" అని "రాసుకుంటే రాసుకో నా చిట్టిపిల్లా" అనేది పాటద్వారా మొదలు పెట్టాడు.

"నీ ఇల్లు ఎక్కడ నాయనా?"

"పెద్ద పెద్ద మేడలకాడవుండే చిన్న చిన్న పూరిల్లు" అని మళ్ళా 'చిన్న చిన్న పూరిల్లు చూడవే నా చిన్నదానా' పదం పాడడం మొదలెట్టాడు. వాడి సంతోషాన్ని, తన్మయతనీ, పాడుచెయ్యడం పాపంగా తోచింది.

రైలు కదిలింది. ఎదురుగుండా ఆకర్షణీయమైన ఆసామి కూర్చున్నాడు. కోటు, పాగా, తోలుపెట్టి, కర్ర, నోట్లో చుట్ట మొదలైన పరికరాలతో ప్రపంచాన్ని తిలకించే నిమిత్తం కళ్ళుమూసి ధ్యానం మొదలెట్టాడు. మీసాలు కొట్టొచ్చేటట్లున్నా, నేత్రాలు మర్యాద చేసే ప్రకృతిని సూచిస్తున్నాయి. సినిమాలో మాదిరి 'లే. వెళ్ళు, ఇప్పుడే' అని ధ్వనులు నా చెవులో మొరెట్టుకుంటున్నాయి.

"తమ నామధేయం?" అని నవ్వుతూ అడిగా.

"తమదీ?"

చెవుడేమోననుకొని "తమ నామధేయం చెప్పారుకాదు" అన్నా రెట్టించి.

"తమరే శెలవిచ్చారు కాదు" అన్నాడాయన.

"తమ మొహం బాగా పరిచయంగా ఉంది. ఎక్కడో చాలామార్లు చూసినట్టున్నాను" అన్నాను.

అస్తమానూ, 'ఆయన' 'నేను' అంటే విసుగెడుతుంది. గనక, మాకు జరిగిన సంగతులు సంభాషణ పూర్వంగా మనవి చేస్తాను.

ఆ : మిమ్మల్ని, చాలామార్లు చూశాను.

నే : నాలో విశేషం ఏముందిలెండి. తమరు పెద్దలు.

ఆ : పెద్దచిన్నలో ఏముంది బాబు. తమరు విద్యాధికులు, విద్యని గౌరవించాలి. మీ పేరు చెప్పారుకాదు.

నే : అనామకుణిణ, అల్పుణ్ణి. నా పేర్లో విశేషంలేదు. ముందు తమది సెలవిస్తే...

ఆ : హఁ, హఁ ఎంతమాట. నా కాలం జరిగిపోయింది. మీరు యువకులు, మీ కాలం.

నే : తమ వయస్సు?

ఆ : అది నేనే అడగాలనుకుంటున్నా. సరే, ఇప్పుడడుగుతున్నాను. ఇరవైనాలుగు?

నే : పోనీ తమ వూరు?

ఆ : మీది గోదావరి మొహంలా ఉంది లేకపోతే కృష్ణాజిల్లానా?

నే : మిమ్మల్ని బందరులో చూశానేమో?

ఆ : మిమ్మల్ని బందరులో చూశానేమో అనిపిస్తోంది నాకూను.

నే : తమకెందరు పిల్లలు?

ఆ : మీకు వివాహం అయిందా? ఐతే ఏమన్నా పిల్లలా?

నే : మీలో చాలా హాస్యరసం ఉందండీ. గోదావరిజిల్లా వాళ్ళు హాస్యానికి పెట్టిన పేరు.

ఆ : మీలో భలే పసందు వుందండీ.

నే : మీ నేత్రాలలో నిశ్చలత్వం వుట్టిపడుతోంది.

ఆ : మీ మొహం అంతా ఆనందం వెదజల్లుతోంది.

నే : ఇవన్నీ కట్టిపెట్టి నీ విషయం చెప్పవయ్యా.

ఆ : ఈ స్తోత్రాలు మన దగ్గర సాగవ్. ముందు నీ సంగతి చెప్పుదూ.

నే : నే చెప్పను. ఏం జేస్తావేటి?

ఆ : నేను చెప్పను. ఏం బెదిరిస్తావా? భలే పెద్దమనిషివే.

నే : ఏం ఇదిగా వుంది నీ కథ!

ఆ : ఛవ్

నే : ఛప్ అంటే "ఛుప్" తెలిసిందా?

ఆ : కబడ్దార్! తమాయించి నోరు కట్టిపెట్టండి.

నే : ఏమయ్యో ఎవరనుకుంటున్నావు. నేను చాలా పుస్తకాలు చదివాను.

ఆ : మా బాబయ్య బోలెడు పుస్తకాలు రాశాడు. కాపీలు కావాలంటే నాకు వ్రాయాల్సిందే తెలిసిందా?

నే : నీ దగ్గర పుస్తకాన్ని లంచం ఇచ్చినా చదవను.

ఆ : మా బాబయ్య పుస్తకం దూషణ, నా దూషణ నోరు ముయ్యండి.

నే : క్షమించి నాలిక కట్టండి.
ఆ : మళ్లా పేలు, దవడ వాయించగలను.
నే : నేను సిద్ధం – ఏం, మీది కొస్తున్నావు.

ఆ సమయంలో రైలు ఆగడం, ఆయన దిగడం జరిగింది కాని, లేకపోతే ఏం జరుగునో ఆఖరికి కార్నీజీ దొరగారు కూడా చెప్పలేరు. ఆయన కోటు జేబులో కార్నీజీగారి గ్రంథరాజం కనిపించింది.

వెయ్యి నూటపదహార్లు, వెయ్యినూటపదహార్లు.

మాలో కొందరు నల్లమందు ఖాయిలాలు, కార్నీజీగారి మూడో ప్రశ్న మరిచి ఏమి వుండొచ్చు. అందుకని మళ్ళా రాస్తున్నా.

3) మీరు ప్రేమించిన స్త్రీ, మీ పాదాల మీద వ్రాలడం ఎట్లా?

ఈ ప్రశ్న ప్రపంచంలో సగంమందిని, ప్రతినిత్యమూ బాధిస్తూనే ఉంటుంది. ఐదువందల ఇరవైనాలుగు దినాల క్రితం నన్ను బాధించడం మూలానే కార్నీజీగారి గ్రంథం కొనడం జరిగింది. "మీరు ప్రేమించిన స్త్రీ" అంటే ఏమిటి? మా అన్నయ్య సుప్రసిద్ధ హాలీవుడ్ ఫిలింతార 'విలియన్‌లే'ని ప్రేమించానంటాడు. మా మామయ్య "మిర్నాలాయ్"ని స్మరిస్తుంటే మా అత్త విని కసురుకుంటుందని మూడు రోజులు మంచమెక్కాడు. మా కాలేజీ హిస్టరీ ప్రొఫెసర్‌గారు సాధానాబోస్ కోసం తల క్రిందులుగా తపస్సాచరిస్తున్నాడు. "శోభనా సమర్త్ గుండె పరీక్ష చెయ్యడం కోసం, నేనేం చెయ్యను?" అని మొన్న ఆస్పత్రిలో డాక్టర్ సదాశివన్‌గారు గట్టిగా అన్నాడుట. దాన్నిబట్టి కార్నీజీగారి సిద్ధాంతాలు అనుచరణంలో పెడితే, ఈ పై వ్యక్తులు అంతా చక్కావొచ్చి, సదరు పురుషుల పాదాలమీద పడతారనుకోడం పొరపాటు అట్లా జనం అపోహపడకుండా 'మీరు ప్రేమించిన స్త్రీ'ని 'డిఫైన్' చేశాడు.

ఎ) మీరు ప్రేమించింది అసలు 'స్త్రీ' ఐ వుండాలి.

బి) ఆమె జీవించే ఉండాలి. (నా బోటిగాళ్ళు ఈ సంగతి మరిచిపోకూడదు. కాళిదాసు శకుంతల, గురజాడ వారి బుచ్చమ్మ, మునిమానిక్యంవారి కాంతం, లేక చరిత్రలో 'చాంద్‌బీబీ' 'ముంతాజ్‌మహల్' వగైరా స్త్రీలని కోరకూడదన్నమాట)

సి) సాధ్యమైనంతవరకూ 'కన్య' ఐ వుండాలి. అంటే పెండ్లి కాకూడదు. (ఇది ఇంచుమించు అందరూ జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయం)

డి) తన శరీరం లావణ్యం మీదనే తన జీవనోపాధి జరిగిపొయ్యేది – అవకూడదు. (సినిమా తారలు కాకూడదన్న మాట)

ఇ) మీరు ప్రేమించే ముందు, ప్రేమించేటప్పుడు, ప్రేమించిన సంవత్సరం వరకూ– ఆమె మీరు వొకే గ్రామంలో కాని, అధమం ఒకే తాలూకాలో కాని ఉండాలి.

ఎఫ్) ఆ ప్రేమించిన స్త్రీని వివాహం ఆడేటందుకు, సాంఘికంగా గాని, ఆరోగ్యరీత్యాకాని అంతరాయాలు ఉండకూడదు.

జి) మీ కంటే కొంచెం బీదదై వుండాలి.

హెచ్) పొట్టిది కాకూడదు. మీ కంటే పొడుగ్గా ఉంటే మరీ మంచిది.

ఈ ఎనిమిది నియమాలకి సరిపొయ్యేది ఒక్క "జ్ఞానవేణి" కార్నీజీ కేవలం ఈ కన్యని చూసి తన నియమాలని వ్రాశాడా అనిపిస్తుంది. ఆ కన్యని వర్ణించే సమయం ఆసన్నమైంది.

అసలు పేరోటి వుందికాని, నాకదేమిటో తెలీదు. చిన్నతనంలో చాలా చలాకీగా, చురుకుగా వుండడంవల్ల వాళ్ళ వాళ్ళు, ఆ పేరెట్టారని తెలుసు. ఇకనుంచి 'జ్ఞానం' అనే వాడతాను. వాళ్ళ నాన్న ఏం పని చేస్తున్నాడో ఎవళ్ళకీ తెలీదు. ప్రొద్దున్నే వెళ్ళి, సాయంత్రం ఇంటికొస్తాడు. తమ్ముళ్ళూ, అన్నలూలేరు కాని 'జ్ఞానానికి' ముగ్గురు చెల్లెళ్ళు, ముగ్గురు అక్కలూ ఉన్నారు. పెద్దక్క ఆడపిల్లల స్కూల్లో సంగీతం మేష్టరు; రెండోది మెడికల్ కాలేజీలో చదువుతోంది. మిగతా ముగ్గురు చిన్న పిల్లలు. ఈ ఏడుగుర్నీ ఒక్కసారిగా నేనెప్పుడూ చూళ్ళేదు – అంచేత వీళ్ళందర్లోకి ఎవళ్ళు చక్కటివాళ్ళో నేను నిర్ణయించలేను. కాని అందరికీ కొన్ని సమాన లక్షణాలున్నాయి. అంతా నల్లగా వుంటారు; చాలా పీలగా పొడుగ్గా ఉంటారు. ఎవళ్ళకీ వివాహం కాలేదు. ఒక్కళ్ళకీ వొంటిమీద ఏ ఆభరణం ఉండదు ఆఖరికి 'శాంపిల్' గాజులు కూడా వుండవు. అందరూ ఎప్పుడు నవ్వుతూనే ఉంటారు. అంతా తెల్లఖద్దరు చీరలు కడతారు – ఐదోదీ పరికిణీ, ఆరోది లాగు ధరిస్తారు. జ్ఞానవేణితో నా పరిచయం, సరిగ్గా మూడుదినాలు. ఆ సంవత్సరం నేను బి.ఏ. ఫేలయి, వూరికే వుంటున్నా మా మామయ్యగారింట్లో. ఆ రాత్రి మామయ్య జలుబూ, రొంపాతో బాధపడుతూ భోజనం మానేసి, కాఫీ త్రాగుతానన్నారు. రాత్రి ఎనిమిదైంది. కాఫీపొడుం లేకపోయింది. అత్తయ్య వాళ్ళింటి కెళ్ళి కొంచెం పొడుం బదులు తీసుకురమ్మని నన్ను పంపింది. అంతకు పూర్వం వాళ్ళ సంగతి నాకు తెలీదు. ఆకాశాన చిన్ని చంద్రుడున్నాడుకాని, నేను ఆకాశం కేసి చూళ్ళేదు. వెళ్ళి తలుపు తట్టాను. 'జ్ఞానం' వొచ్చి తలుపు తీసింది. మొట్టమొదట నన్నాకర్షించింది తెల్లటి పళ్ళవరస.

"ఎవరి కోసం?"

"..........."

"ఎవరి కోసం?"

"కాఫీ పొడుం" అన్నా సరిగ్గా, బహు పల్చటి మనిషి, టార్చిలైట్ వేస్తే 'శరీరం' అంతా ఇట్నించటు చూడొచ్చు. సమానంగా సాఫీగా మెరిసే ఛామనచాయ. 'ఆర్చి'లా అమర్చబడ్డ కనుబొమ్మలు; ఇంక ఆ 'కళ్ళు'న్నాయి. మహాప్రభో వర్ణించేటందుకు 'షెల్లీ' యో, వెంకటచలమో రావాలి. మొగాడి తాలూకు గట్టితనంతో కూడుకున్న నాజూకు శిల్పంలోని నిశ్చలత్వం, కవిత్వంలోని 'రొమాన్సు' సృష్టిలోని చాంచల్యం – వొక టేమిటి ద్వంద్వాల కలయిక. మొహంలో గుండ్రన, శరీరంలో 'చదరత్వం' చెక్కిళ్ల నునుపు భుజాలకరుకు; మెడలో మెత్తదనం; వక్షంలో గట్టితనం; జడలో బరువు; నడుంలో తేలిక; పళ్లలో సంతోషం, కళ్లలో విచారం.

"మా ఇంట్లో కాఫీ తాగం"

నేను వెళ్ళిపొయ్యాను. అది నా మొదటి పరిచయం. అరగంటలో నా రెండో పరిచయం జరిగింది.

మా ఇంటికి చక్కావొచ్చి తలుపు తట్టింది. బైటకొచ్చాను. తలుపు దగ్గరగా మూసి మఱ్ఱిచెట్టు కిందికి నడిచా.

"మా ఇంట్లో కాఫీపొడుం లేదు" అంది.

ఆమె కేసి పరకాయించి చూశాను. తెల్లటిచీర శరీరం వొంపులని పట్టుకుని; 'సమన్వయత్వాన్ని' చాటిస్తోంది. చెక్కిళ్లు తప్ప శరీరంలో అన్ని పల్లాలే - అరచెయ్యి ఎక్కడ మోపినా దానికోసం అన్నట్లు ఇమిడిపోతుంది.

"పోనీ"

"కాని 'టీ' వుంది.

"మా మామయ్యకి నిద్రపట్టదేమో?" అన్నా.

"మా 'టీ' నిద్ర పట్టిస్తుంది. పరుంటే మరి లేవడు."

"సరే"

వాళ్లింట్లోకి పరుగున వెళ్లి పొట్లంతో చక్కా వచ్చింది. చాలా పెద్ద జెడ, అంత జెడ నేనెప్పుడు చూడలేదు. ఆత్మహత్య చేసుకోదలచిన వాళ్లు. ఆ జెడని కంఠానికి చుట్టుకుంటే సునాయాసంగా చస్తారు. అల్లాంటి చావు మంచిదని ఆ క్షణాన నిశ్చయించు కున్నాను. నవ్వింది, ఆవులించి, అన్ని అవయవాలని కదిల్చింది; ఎందుకో భయపడి పమిటకొంగుని శాలువాలా భుజాలమీద కప్పుకుని తన వొంటికేసి చూసుకుని నాకేసి చూసి నవ్వింది. ఆ నవ్వే, నా మనస్సులో మెరుపులా చీల్చి మెరిసింది. నవ్వుకి నా శరీరం మీద అంత వొత్తిడి వుంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పటికీ అది తల్చుకుంటే నాకు ఏడుపొస్తుంది. ఏ క్షణంలో మొగాడు దేన్ని చూసి భ్రమిస్తాడో తెలీదు కాబోలు, స్త్రీలు తమ లావణ్యంతో, ముస్తాబుతో అంత శ్రమపడతారు!

కార్నీజీగారు పుస్తకం ఆ మొర్నాడు కొన్నాను. అదంతా అర్థం చేసుకుని స్త్రీని ఆకర్షించే విధానాన్ని సిద్ధం చేసుకున్నాను. మీలో ఎవళ్ళకేనా ఉపయోగం పడుతుందని ఈ కింద రాస్తున్నాను.

1) పొగుడు, మెచ్చుకో. వీలైతే కవులు చెప్పిన సంగతులు అప్పగించు.

2) మరో స్త్రీతో పోల్చకు.

3) పెండ్లి ప్రశంస ఎత్తకు (చదువుకున్నదైతే)

4) నిన్ను నువ్వు తిట్టుకో - దౌర్భాగ్యుడని, గుంతని, వెఱ్ఱివెధవని అని.

5) వయస్సు అడగకు.

6) మాట్లాడటం చేతకాకపోతే ఉత్తరం వ్రాయి. (నాలుగు వాక్యాల కంటే మించకూడదు)

7) సాధ్యమైతే భుజంమీద చెయ్యి వెయ్యి జడట్టుకో. పాదాలకేసి చూడు. (ఈ ఆఖరిది పుస్తకంలోది కాదు. 'హేవ్‌లాక్ ఎల్లిస్' చెప్పాడు)

జ్ఞానవేణితో మూడో పరిచయం జరిగినప్పుడు ఇవన్నీ ఆచరణలో పెట్టాను. ఏం జరిగిందో వ్రాస్తున్నాను.

'జ్ఞానం' కిరసనాయిలు కోసం సీసా తీసుకొని మా ఇంటికొచ్చింది. మర్రిచెట్టు క్రింద నేను నుంచున్నాను.

"కిరసనాయిలా?" అని అడిగా ఏదో మాట్లాడిద్దామని.

"కనిపిస్తూనే వుందిగా" అంది. నా మనస్సు చివుక్కుమంది.

"ఖద్దరు చీర నీకెంతో బాగుంది" అన్నా. అటూ ఇటూ చూస్తూ.

జ్ఞా : "మీ కెందుకు?"

నే : చూసి ఆనందిస్తా. మీ ఇంట్లో అంతా ఖద్దరే కడతారా?"

వే : "చూసి ఆనందించడం తప్పే? నీ సన్నటి వొంటిమీద ఆ ముతగ ఖద్దరు.

జ్ఞా : "ఏం మాటలండి."

నే : "టెన్నిసన్ ఏమన్నాడంటే సౌందర్యానికి ఏ బట్ట ఐతే నేమి..."

జ్ఞా : .........

నే : మిస్ జ్ఞానం... నాకో ప్రశ్న వెయ్యాలని ఉంది. మొదట నిన్ను చూసి క్రిష్టియన్ పిల్లనుకున్నా, మెళ్లో చేతులకీ, కాళ్ళకీ, చెవులకీ వొక్క ఆభరణమేనా లేదెందుకు?

జ్ఞా : మాకు నగలిష్టం లేదు.

నే : అవును సహజ సౌందర్యం వుండాలిగాని పోనీ జడలో నాలుగు పూలెట్టుకో గూడదా?"

జ్ఞా : అవన్నీ మీకెందుకు? నే వెళ్ళి చదువుకోవాలి. తెల్లారితే ఇంగ్లీషు పరీక్ష.

నే : అయ్యో. నీ లేత హృదయానికి, ఈ ఆంగ్లభాష విషం వొకటా... నీ లేత పెదవులమీద ఆ కఠోర పదాలని ఉచ్ఛరించడం ఎంత కష్టం.

జ్ఞా : షటప్ ప్లీజ్. నేనంటే ఏమిటనుకున్నారు?

నే : నా ఎడారి జీవితంలో వడగళ్ళ వర్షం నీ నవ్వు. నా కన్నీటి కెరటాలపై వెన్నెల నురుగు నీ నవ్వు.

జ్ఞా : ఫూల్!

నే : నీ చీర కుచ్చిళ్ళు. నా స్వర్గ సోపాన పంపర్లు. నీ జడ నా బ్రతుకు నిలయం.

జ్ఞా : ఛీ. మొగాడు జంతువు. ఫూల్. తొందరగా వెళ్ళింది. వెనకాల వెళ్ళి జడ పట్టుకున్నా. 'స్టుపిడ్' అని తిట్టి వెళ్ళి తలుపు గట్టిగా నా మొహాన్ని మూసింది. ఆ రాత్రి కార్నీజీగారి గ్రంథాన్ని నా గుండెమీద పెట్టుకుని, ఎంతసేపు ఏడిచానో ఆ బాధ టెన్నిసన్‌కి కూడా తెలీదు.

రెండువేలు, రెండువేలు, రెండువేలు.

సరిగ్గా మూడు మాసాలు నేను జ్ఞానవేణి కోసం తపించాను. నాకు రాత్రుళ్ళు నిద్ర పట్టలేదు. పగలు కాలేజీకి వెళ్ళే సమయం వొచ్చేటపుడు, వొక్కసారి చూడాలని కాచుకుని నా కాళ్ళు పడిపొయ్యేవి. ఆఖరికి ఉత్తరం వాళ్ళ గుమ్మం ముందు పారేశాను. తీసుకుంది కాని జవాబు వ్రాయలేదు. తరవాత ఆ పిల్లని గురించి కొన్ని సంగతులు తెలుసుకున్నా. వాళ్ళది చాలా బీద కుటుంబం. వెనక బోలెడు ఆస్తి వుండేదిట. అదంతా వాళ్ళ నాన్న త్రాగుడికి ఖర్చయిపోయిందట.

ధనికులకి గర్వం అంటారు కాని, నిజానికి బీదవాళ్ళకున్న గర్వం ఎవ్వరికీ వుండదు. జ్ఞానవేణిని తన చేతి గాజులెందుకు లేవంటే, 'డబ్బులేక' అని సమాధానం ఎన్నడూ

చెప్పదు అల్లా ఉండడం తన ఆదర్శంట. "నీకు వివాహం ఐందనుకో – అప్పుడూ ఇల్లాగే వుంటావా చెవలకీ ముక్కకీ ఏమీ లేకుండా?" అంటే ఎంతో కోపం వచ్చింది. వివాహం అనేమాట తలపెట్టడానికి వీల్లేదుట. తనని ప్రేమించేటందుకు అర్హత ఉన్న ఆంధ్ర యువకులు లేనేలేరట!

నాకు నా మీద కోపం వచ్చింది. నేను చదువుకున్నవాడిని – నా చదువు విషయం తెలిసిందంటే సరస్వతి కూడా అసూయ పడాల్సిందే. మన్లో మనమాట. నాకు బోలెడంత ఆస్తి ఉంది. యవ్వనం నాదీను.

నా చక్కదనం మాటంటారా, నామీద తమ ఆశ లెట్టుకుని అనేక మంది ఫిలిం డైరెక్టర్లుగా మారుతున్నారు. ఇదేమిటి నా నెత్తిలా వుంది. కార్నీజీగారు చెప్పిందేమిటి? నే చేస్తున్న దేమిటి?

నన్ను గురించి నాకు నిజం తెలిసింది. నేను 'స్టుపిడ్'ని 'ఫూల్'ని అని జ్ఞానంపై పగ తీర్చుకోడానికి రాచుకుని ఉన్నా, ఒక రాత్రి సమయం చిక్కింది. ఆనాడు పెద్ద వర్షం. వాళ్ళ ఆఖరి చెల్లెలికి తేలు కుట్టింది. మందుకోసం వొచ్చింది. మా అత్త నడిగింది.

పదివేలు, పదివేలు, పదివేలు.

నేను మందుకణిక, దీపం తీసుకుని వాళ్ళ ఇంటికేసి నడవడం మొదలెట్టాను. దీపం వొదిలేశాను చీకటి. నా చేతులకి ఆమె భుజాలు తగిలాయి. గట్టిగా పట్టుకున్నాను – నా బొటనవ్రేలుకి ఆమె మెత్తని గడ్డం తగిలింది. నిశ్శబ్దం. "నీ సౌందర్యం..." అని ఆరంభించాను. మూతి మీద 'ఛెళ్లు'మని తగిలింది. నిజంగా చేతులకి గాజులు లేకపోవడం చాలా మంచిదనిపించింది. తొందరగా వెళ్ళిపోయింది.

ఆనాడు శనివారం. ఇంట్లో ఉంటుందనుకుని ఏదో వొంకన వాళ్ళ ఇంటికెళ్ళాను. వాళ్ళమ్మ ఆహ్వానించింది. కుర్చీలో కూర్చున్నాను. కాఫీ ఇచ్చింది. "జ్ఞానం కాలేజీకెళ్ళింది" అన్నది శనివారం ప్రైవేటు క్లాసులు.

"నేను జ్ఞానం కోసం రాలేదు. మా మామ జబ్బుని గురించి మీ పెద్దమ్మాయితో మాట్లాడడానికొచ్చాను" అన్నాను.

"ఆస్పత్రి కెళ్లింది."

అప్రయత్నంగా బల్లమీద ఉన్న కాగితాల దొంతర కెలికాను. చెత్తకింద, ఒక ఆంగ్లగ్రంథ రాజం కనిపించింది. అట్టమీద 'జ్ఞానం' పేరు వ్రాసింది. అది పుట్టినరోజుకి వాళ్ళ లెక్కల ప్రొఫెసర్‌గారు బహుమానంగా ఇచ్చినట్లు ఆయన సంతకం ఉంది. అది 'హిల్' దొరగారిచే స్త్రీల కోసం వ్రాయబడిన గ్రంథం.

"నువ్వు వాంఛించిన పురుషుణ్ణి పొంది, నీ పాదాలముందు బొమ్మలా ఆడించడం ఎల్లా?" ఈ ప్రశ్నకి సమాధానాలున్నాయి. అందుచే క్రింద అందులోని నాలుగు విషయాలు వ్రాస్తాను.

1) పురుషుడికేసి చూడు. అతను చూడకుండా ఇట్లా చేస్తున్నావని అతను తెలుసుకునేటట్లు చెయ్యి.

2) అసంభవం, అలభ్యం, అసాధ్యం అనుకునేటట్లు ప్రవర్తించు.

3) పొగిడినకొద్దీ తిట్టు, ఏం భయంలేదు.

4) మీదికొచ్చినప్పుడు లెంపకాయ తగిలించు. ఇది చేస్తివా, నీ ముందు కుక్కలా తిరుగుతాడు.

పుస్తకం మూసేసి మా ఇంటికి పారిపోయాను, మానవుడుగా ఉండడం నిశ్చయించుకుని నాగరిక ప్రపంచంలో, స్త్రీలు, పురుషులు ఎట్లా ప్రేమించుకోవాలో, పుస్తకాల ద్వారా తెలుసుకునే గతి పట్టినందుకు విషాద గీతికలు ఏ కవేనా రాస్తే బాగుండును.

ఆకలి, శరీరవాంఛ, ఇవి సృష్టికి సంబంధించినవి. అన్నీ ప్రాణులకి నేర్పకుండా సహజంగానే తెలుస్తాయి ఈ రెండూను. నిజానికి అన్ని జంతువులు బాగా చెయ్యగల్గిన పన్లు ఈ రెండూను, తిండి తినడం, ప్రేమించడం ఒక మానవుడికి మాత్రం, ఈ నాగరిక ప్రపంచలో చేత కావు. పుస్తకాలు చదివి పిల్లల్ని కనే గతి భారత స్త్రీకి పట్టినప్పుడు చాలా తొందర్లో ఈ జాతి నశించే సూచనలు కనిపిస్తున్నాయి.

పాతికవేలు, పాతికవేలు పాతికవేలు.

ఈ పై వాక్యాలు, జ్ఞానవేణి మీద కోపంవల్ల రాశానని, మీరు కాని, జ్ఞానవేణి కాని అనుకోడం పొరపాటు. పొల్లు దొరగారి నిబంధనలు నామీద ప్రయోగించి, నన్ను పొందాలని 'ట్రై' చేస్తుంటే 'జ్ఞానం' ఆ సంకల్పం విరమించొచ్చు. ఎందుకంటే, ఈ మధ్యన, కార్నాజీని, హిల్లునిమించిన మరో దొరగారు పేరు నోటికి రావటం లేదు. మరో గ్రంథం వ్రాసి, నా బోటిగాడి సమస్యలన్నీ తీర్చారు.

ఆయన చెప్పిందేమంటే "నీ చుట్టూ స్నేహితులు గ్రహాలలా తిరగాలన్నా, స్త్రీలు నీ వెంబడి పడాలన్నా, ప్రపంచాన్ని జయించాలన్నా, నీకు కావలసింది వొకటే వుంది. అది 'డబ్బు' అదుంటే అన్నీ వొస్తాయి" అని. ఇది సమంజసంగానే తోచింది. పైగా ఈ ధనం సంపాదించేటందుకు ఆయన చాలా సులభమార్గం బోధించాడు. ఆ మూడు సంగతులూ ఈ దిగువ పొందుపరుస్తున్నాం.

1) ప్రొద్దున్నే లేవగానే వందసార్లు "డబ్బు" "డబ్బు" అనే శబ్దాన్ని జపించు.

2) ఊరికే "డబ్బు" అంటే లాభంలేదు. నీకు ఈ రోజున ఎంత కావాలనుందో నిర్ణయించుకో. ఆ సంఖ్యని పెద్ద అక్షరాలతో కాగితంమీద వ్రాసి, ఫోటో కట్టించి, గోడకు కట్టు.

3) ఏదేనా వ్రాసేటప్పుడు ఆ సంఖ్య మరిచిపోకుండా మధ్యలో జ్ఞాపకం చేసుకుంటూ వుండు.

అందుకనే ఈ వ్యాసం ఆరంభంనుంచీ, చివరవరకూ, నాకు కావలసిన 'డబ్బు విషయం' వ్రాసి జ్ఞప్తికి తెచ్చుకున్నాను. ఇప్పుడు ప్రస్తుతం కావలసింది పాతికవేలు. ఎడిటర్‌గారు కూడా ఈ గ్రంథమే చదివారంటే ఏం జరుగుతుందో, నా రెండు అనుభవాలనుబట్టి పాఠకులే ఊహింతురుగాక.

**(లిఖిత ప్రతి ఆధారముగా)**